

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు చేయాలనికలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరు తన ఛాంబర్‌లో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (పిసి పిఎన్‌డిటి) అమలుపై జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్త శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ మరింత ముమ్మరంగా నిర్వహిం చాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. జిల్లా ఇన్వ్యాక్సైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి రామారావు, డెమో కనకరత్నం, ఎన్‌జివో కవితారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

వేసవి తీవ్రతను అధిగమించేందుకు

ముందస్తు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు

వేసవి తీవ్రత దష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్నిశాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు తన ఛాంబర్‌లో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఎండతీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో, 108 వాహనాల్లో ఐస్‌ప్యాక్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాలని డ్వామా అధికారులకు సూచించారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాలు, బస్సుల్లో వాటర్ కేన్లు ఏర్పాటుచేయాలని ఆర్‌ఎంకు సూచించారు. గ్రామ స్థాయిలో డ్వాక్రా సంఘాల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చేతిపంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎక్కడైనా పనిచేయకుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలకు గ్రామవ్యవసాయ సహాయకుల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. కరెంటు కోతలు, షార్ట్‌సర్క్యూట్ లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేతకు వెళ్తున్న పశువులకు తాగునీటి దప్పిక తీర్చేందుకు నీటివసతి అందుబాటులో వున్న ప్రదేశాలను ఎంపిక చేసిన నీటితొట్టెలు ఏర్పాటు చేయాలని పశు సంవర్ధకశాఖ జేడీకి సూచించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ జేడీలు సత్యవాణి, రమేష్‌నాయక్, ఆర్‌టిసి ఆర్‌ఎం మురళీబాబు, విద్యుత్‌శాఖ ఈఈ ఎం శ్రీధర్, డ్వామా ఎపివో కనకదుర్గాభవాని, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్‌వల్లి, ఐడిఎస్‌పి జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

◆ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు..

◆కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

ఏళ్ల తరబడి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వయస్సు 60 ఏళ్లు దాటాయన్న కారణం చూపిస్తూ ముందస్తు నోటీసు అందజేయకుండా హఠాత్తుగా విధుల నుంచి తొలగించివేస్తూ కార్పొరేషన్ అధికారులు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ఏళ్ల తరబడి పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను, పనిని ప్రయివేటు ఏజెన్సీలకు,కాంట్రాక్టర్లకు అప్పగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమీ లేకుండా, వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఏ నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా సంవత్సరాల తరబడి చేస్తున్న ఉద్యోగాల నుండి నిలిపివేయడం అన్యాయమ న్నారు. 60 సంవత్సరాలు పూర్తయ్యాయి అనే నెపంతో నెల్లూరు నగరపాలక సంస్థలో ఏళ్లతరబడి పనిచేస్తున్న 93 మంది ఆప్కాస్ ఉద్యోగులను హఠాత్తుగా అధికారులు నిలిపి వేయడం సరికాద న్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి, వారసులకు ఉద్యోగాలు ఇచ్చేంతవరకు భేషరతుగా ఉద్యోగాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.పెంచలనర్సయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేషన్ కార్మికులపై వేదింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ఆప్కాస్ విధానం రద్దు చేసి ప్రయివేట్ ఏజన్సీలకు అప్పగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ మేలు చేస్తామంటూ ఆర్భాటంగా హామీలు ఇచ్చారని, అందుకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ధర్నా అనంతరం మున్సిపల్ కార్మికులు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు సమస్యల తీవ్రతను వివరించిన సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. సిపిఎం రూరల్ కమిటీ నాయకులు కట్టా సతీష్, మాలకొండయ్య, ఈశ్వరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, లోకేష్, సుజాతమ్మ, కామాక్షమ్మ,శ్రీనివాసులు,సురేంద్ర, భాగ్యమ్మ, మనోజ్, జయకుమార్ ఉన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లలో విశేష కషి చేసిన అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని కమిషనర్ సూర్య తేజ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పన్నుల వసూళ్లను కమిషనర్ వివరిస్తూ గత ఏడాది ఏప్రిల్ నెల 1 వ తేదీ నుంచి 31-03-25 వ తేదీ వరకు ఆస్తి పన్ను మొత్తం రూ. 70,14,02,787/- కోట్లు కాగా, ఖాళీ స్థలం పన్నులు రూ. 7,62,06,972/- కోట్లు, తాగునీటి కుళాయి పన్ను రూ. 9,85,83,800/- కోట్ల వసూలు చేశామని తెలిపారు.

నేడు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 30న పాలిసెట్ 2025 పరీక్ష నిర్వహించనున్నారు. ఆ ప్రవేశ పరీక్ష రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈనెల 2న ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉప్పు చెరువు రోడ్డులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు .9398104049,2. 9866174419 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కాకాణిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు

బెయిల్ పిటిషన్ రేపటికి వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మరో కేసు నమోదైంది.సోమవారం రాత్రి నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఇప్పటికే అక్రమ మైనింగ్ కేసుపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్ పై విచారణను గురువారానికి వాయిదా వేసినట్లు సమాచారం. అక్రమ మైనింగ్ కేసులో వారం రోజుల నుంచి హైడ్రామా నడుస్తుంది.పోలీసులు హైదరాబాద్ వెళ్లి రెండు సార్లు ఆయనకు నోటీసులిచ్చారు. బుధవారం మధ్యాహ్నం 11గంటలకు డిఎస్‌పి ముందు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కుటుంబ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు కాకాణి మూడ్రోజుల క్రితం వెళ్లారు. కాకాణి డిఎస్‌పి ఎదుట హాజరవుతారా లేదా అనే విషయం ఉత్కంఠ నెలకొంది.ఒక వేళ అక్రమ మైనింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా ఆయనను అరెస్టు చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతుంది.ఈ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు.కేసులకు భయపడమని, ఎదుర్కొంటామని తెలిపారు.కాకాణి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది.

విఎస్‌యు విసి అల్లం శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వి కృష్ణారెడ్డి తదితరులు

ఘనంగా 'కృష్ణ చైతన్య' వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్

కృష్ణ చైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగరంలోని సిపిఆర్ కళ్యాణమండపంలో జరిగిన ఈ వేడుకలకు విక్రమ సింహపురి యూనివర్సిటీ విసి అల్లం శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ రానా ప్రమోద్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విఎస్‌యు విసి అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్ణ చైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 17 ఏళ్లుగా కష్ణ చైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యారంగంలో సేవలందించడం అభినందనీయమన్నారు.లాంగ్ రన్ కలిగిన ఈ కళాశాలలో.. ప్రారంభ దశ నుంచి ఉన్న అధ్యాపకులు ఇప్పటికీ పనిచేస్తుండడం.. కళాశాల గొప్ప సేవలకు నిదర్శనమన్నారు. కృష్ణ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణ చైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ అల్లం శ్రీనివాసరావు హాజరు కావడం గర్వకారణంగా ఉందన్నారు. నెల్లూరు జిల్లాలో అన్ ఎయిడెడ్ కళాశాలల్లో తమ కళాశాలకే మొదట న్యాక్ గుర్తింపు దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కష్ణ చైతన్య విద్యాసంస్థలను ప్రారంభించి 27 ఏళ్లు అయిందని,కష్ణ చైతన్య సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రారంభించి 17 ఏళ్లు పూర్తయిందన్నారు. అల్లం శ్రీనివాసరావు గారి సారథ్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ భవిష్యత్తులో.. మరింత ఉన్నతంగా వెలుగొందాలని ఆకాంక్షించారు.తమ కళాశాల న్యాక్ బి ప్లస్ గ్రేడ్ ను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ లివైస్ ఛాన్స్ లర్ అల్లం శ్రీనివాసరావును.. అధ్యాపక సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం పీజీలో యూనివర్సిటీ మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు వైస్ ఛాన్సర్ అల్లం శ్రీనివాసరావు గారు గోల్డ్ మెడల్ అందజేసి అభినందించారు. పీజీ కళాశాల డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ యం ప్రసాద్,హెచ్ ఓ డి లు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎర్రచందనం దుంగలు పట్టివేత

వాటి విలువ సుమారు రూ. 15 లక్షలు

ప్రజాశక్తి -రాపూరు : రాపూరు సమీపంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో ఉన్న సుమారు రూ. 15 లక్షల విలువైన ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రాపూరు మండలానికి సమీపంలో ఉండే వెలుగొండ అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు అధికంగా ఉంటాయి.ఎర్రచందనం స్మగ్లర్లు రకరకాల మార్గాల్లో దుంగలను చెన్నైకి తరలి స్తుంటారు. తాజాగా మంగళవారం ఉదయం అశోక్ లేలాండ్ (దోస్త్) వాహనంలో ఎర్రచందనం దుంగలు ఉంచి పైన గడ్డిమోపులు వేసి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మద్దెలమడుగు ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేసేందుకు ఆపారు. దీంతో ఆపకుండా వేగంగా వెళ్లడంతో వెంబడించిన ఫారెస్ట్ సిబ్బంది కొద్ది దూరం వెళ్లగానే వాహనాన్ని ఆపి డ్రైవర్ పరారయ్యాడు. వాహనం తనిఖీ చేయగా వాహనంలోఉన్న 89 ఎర్రచందనం దుంగలను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఫారెస్ట్ రేంజర్ రవీంద్ర బాబుకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన వాటి విలువ రూ. 15 లక్షలు వరకు ఉంటుందని, అవి ఏ గ్రేడ్ దుంగలని రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్న దుంగలు

పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

పెన్షన్ల పంపిణీలో సిబ్బంది అలసత్వాన్ని సహించే ప్రసక్తే లేదని ఎంపిడిఒ కె నరేంద్రదేవ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొండసముద్రం గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. 8 గంటలు అయినా గ్రామంలో ఒక క్లస్టర్ ఇన్‌ఛార్జి పింఛన్ల పంపిణీని ప్రారంభించకపోవడంపై ఎంపిడిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు పలువురికి ఎంపీడీఓ నరేంద్రదేవ్ స్వయంగా పెన్షన్ నగదును పంపిణీ చేశారు. సాయంత్రం సమయానికి మండలంలో 90 శాతం పైగా పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పరుచూరి సురేష్ బాబు తో పాటు సచివాలయం డిజిటల్ సహాయకులు షేక్ ఖాదర్ బాషా, గ్రామ నాయకులు ఘట్టమనేని సుబ్బారావు, ఉన్నం సురేష్, కొమరా రమణయ్య, నువ్వుల కొండయ్య ఉన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం రజకుల సమస్యలు పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతవహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రజక వత్తిదారుల సంఘం నాయకులు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని రజకుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం చేసేటటువంటి కార్యక్రమాలు పోరాటాలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదాల సంఘం ఆధ్వర్యంలో 7వ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 20 -21 కొండపల్లిలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలో ఉన్న రజకుల సమస్యల పైన చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు రజకులకు సామాజిక రక్షణ చట్టం, ఇస్త్రీ చేసే ఇస్త్రీదారులందరకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, రజక కార్పొరేషన్ ద్వారా మా కుటుంబాల్లో ఉన్న యువత యువకులకు ఉపాధి కల్పించే విధంగా స్కిల్ డెవలప్మెంట్ ద్వారా రుణాలు ఇవ్వాలని, ఆదరణ పథకం ద్వారా వత్తిదారులందరికీ అధునాతనమైన పనిముట్లతో మోడరన్ దోబిగా ఏర్పాటు చేసి వత్తిదారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉత్తిదారులకు ఈ ప్రభుత్వం చేసిన హామీలు అమలు చేయించేందుకు పోరాటాలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా వ్యవహరించిన నేరెళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం రజక కార్పొరేషన్‌కు అధిక సంఖ్యలో నిధులు కేటాయించాలన్నారు. ఏప్రిల్ 20 -21 తేదీ జరిగే రాష్ట్ర మహాసభలను ఈ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తకోట వెంకటేశ్వర్లు దేవరకొండ వెంకటేశ్వర్లు, కంచర్ల సాయి, పొట్టేపాళెంసుధకర్, సురభి శ్రీనివాసులు,గోనిలశ్రీనివాసులు పందేటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'బుర్రా'తో కార్యకర్తలు భేటి

ప్రజాశక్తి-కందుకూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా బుర్రా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెలలో జరిగే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకునికందుకూరు పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఈనెల 1 నుంచి 13వ తేదీ వరకు జరుగుతున్న నివాళులు అర్పించు కార్యక్రమం మంగళ వారం ప్రారంభమైంది. ఎఎడి అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ,దమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్ల నుంచి బహుజనోద్యమనేత క్రీ"శే కట్టా వెంకట నారాయణ ఆశయాల సాధనలో పాలేటి సుచరిత సహకారంతో జరుగుతున్నాయి. దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపాసక గాండ్ల. హరిప్రసాద్ పూల మాలలు వేసి ఈరోజు ప్రారంభించి నివాళి అర్పించారు. ముప్పవరపు.కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం,మద్దాల రామారావు, కుంచాల వెంకటేశ్వర్లు,ఉచ్చులూరి రవీంద్ర, మెడబలిమి పుష్ప రాజ్, పొనుగోటి ప్రభాకర్,జంగాల శ్రీమిత్, ధన్యాసి దీపక్,చనమాల కోటేశ్వరరావు ఉన్నారు.

మాట్లాడుతున్న కంచర్ల రామయ్య

ఘనంగా రామయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలు నేడు కళాశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామయ్య కుటుంబ సభ్యులు, బాల్య స్నేహితులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు ముఖ్య అతిథిగా హాజరైన బెజవాడ వెంకట్ రావు మాట్లాడుతూ, "రామయ్య ఎలాంటి బాధ్యతను తీసుకున్నా, ఎల్లప్పుడూ నిబద్ధతతో ముందుకు సాగారన్నారు. జర్నలిజంలో 'ఈనాడు రామయ్య'గా గుర్తింపు పొందిన ఆయన, అనంతరం గ్రామీణ ప్రాంతంలో ఇంజనీరింగ్ కాలేజీ స్థాపించి 'ప్రకాశం రామయ్య'గా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. విశ్రాంత అధ్యాపకుడు కంచర్ల సుబ్బా రావు మాట్లాడుతూ, "చిన్నప్పటి నుంచే రామయ్య కషి ప్రియులు అన్నారు. డాక్టర్ అదిలా బాను మాట్లాడుతూ, "రామయ్య తన భర్త డాక్టర్ ఇక్బాల్ సహాధ్యాయి. ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పది.. విద్యార్థులకు నైతిక విలువలను బోధించే గొప్ప గురువు," అని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ, "రామయ్య విద్యా రంగానికి చేసిన సేవలు అపారమైనవన్నారు. ఎంఎల్‌సి శ్రీకాంత్ మాట్లాడుతూ, "నా రాజకీయ ప్రవేశానికి తన తండ్రి రామయ్యనే ప్రేరణ అన్నారు. . ఆయన ఎప్పుడూ సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో ముందుకు సాగేవారన్నారు. ఆయన చూపిన మార్గంలో తాను నడవాలని, ఆయన ఎల్లప్పుడూ ప్రోత్సహించారని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ్ అన్నారు, నాన్న విద్యార్థుల పరిరక్షణ, వారి ప్లేస్‌మెంట్స్, అధ్యాపకుల సంక్షేమం పట్ల చూపిన శ్రద్ధ, ఈ కళాశాల అభివద్ధికి మూలాధారంగా నిలిచిందన్నారు. అతిథులు ,కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో వేద పండితుల ఆశీర్వచనాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వాతావరణం ఉత్సాహభరితంగా మారింది .కళాశాల మెకానికల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జి.వి. పున్నారావు డా. కంచర్ల రామయ్య జన్మదిన సందర్భంగా స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల పాఠశాలకు బియ్యం బస్తాలు అందజేసి విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. రామయ్య పట్ల తమ అభిమానాన్ని దాతతతో చాటి చెప్పారు.అంతేకాక, అతిథులు రామయ్యకి హదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కంచర్ల రామయ్యను సత్కరిస్తున్న అభిమానులు

నిత్యావసరాలు అందజేత

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య పుట్టినరోజు వేడుకలు పట్టణంలోని కోవూరు రోడ్డు నందు గల స్వర్ణ స్వయంకషి మానసిక దివ్యాంగుల పాఠశాల మానసిక దివ్యాంగుల మధ్య చేసుకున్నారు. దివ్యాంగులకు కేకు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల బోధన బోధనేతర సిబ్బంది 50 కేజీలు బియ్యాన్ని డాక్టర్ రామయ్య చేతులు మీదుగా పాఠశాల కరస్పాండెంట్ కు అందజేశారు. డాక్టర్ రామయ్య మాట్లాడుతూ తన పుట్టినరోజు దివ్యాంగుల మధ్య చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా తమ కళాశాల బోధన బోధనేతర సిబ్బంది 50 కేజీల బియ్యాన్ని అందించడం మంచి సేవా కార్యక్రమం అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, వారి సిబ్బంది డాక్టర్ కంచర్ల రామయ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, మెకానికల్ హెచ్ ఓ డి డాక్టర్ జి పున్నారావు, మెకానికల్ ల్యాబ్ హెల్పర్ పి.రామారావు, మ్యాథమెటిక్స్ హెచ్ ఓ డి జి ప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఉన్నారు.

సచివాలయంలో ఎంఎల్‌ఎ తనిఖీ

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

వలేటివారిపాలెం మండలం, పోకూరు గ్రామ సచివాలయాన్ని ఉన్నతాధికారులతో కలిసి ఆకస్మికంగా ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరావు మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాలకు సమయ పాలనలో ఉద్యోగులు హాజరవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఎంఎల్‌ఎ ఆదేశించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

ఎంఎల్‌ఎను సన్మానిస్తున్న నాయకులు

సిఎంకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-కావలి

బుడగ జంగాలను ఎస్‌సి జాబితాలో చేరస్తామని ప్రకటన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని కావలి బేడ బుడగ జంగాల నాయకుడు శివలింగం ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని బుడగ జంగాలు కలిసి శాలువాతో సత్కరించారు. బుడగ జంగాలకు అండగా నిలుస్తున్నందుకు కూటమి ప్రభుత్వాన్ని వారు అభినందించారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

మాట్లాడుతున్న వైద్యులు

ఆరోగ్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-సీతారామపురం

వరల్డ్ ఓరల్ హెల్త్ డే మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిహెచ్‌పి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.స్వప్న, ఉదయగిరి సిహెచ్‌సి డెంటిస్ట్ డాక్టర్ అనీస్ సల్మా మాట్లాడుతూ సిబ్బంది అందరూ తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఓరల్ హెల్త్ గురించి అవగాహన కల్పించాలన్నారు. దంత సమస్యలు రాకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. దంత సమస్యలు ఉన్న వారు ప్రతి మంగళవారం సీతారామాపురంలోని పిహెచ్‌సికు, సోమ, బుధ, శనివారాలలో ఉదయగిరి సిహెచ్‌సికి తీసుకురావాలన్నారు. అనంతరం వరల్డ్ వరల్డ్ హెల్త్‌పై పలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కావలి

కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల్ కుమార్ సమాచారం మేరకు పదవ తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులకు పాలీసెట్ -2025కు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ఏప్రిల్ 3వ తేదీ నుండి కావలి విశ్వోదయ గర్ల్స్ హైస్కూల్, కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్, రుద్రకోటలో నిర్వహిస్తారన్నారు. కనుక ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచిత మెటీరియల్, ఉచిత పరీక్షలు కూడా నిర్వహించబడతాయని అయన తెలిపారు. మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్‌లను 9949022772, 9966797981 సంప్రదించాలని సుశీల్ కుమార్ ప్రియా కోరారు.

ఆహార పొట్లాలు అందజేస్తున్న సభ్యులు

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట

బొంత సరోజినమ్మ, బొంత వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా మంగళవారం వారి కుటుంబ సభ్యులు బొంత అరుణకుమారి బోగోలు మండలం ముంగుమూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో వారికి హైవేపై ఉన్న పేదలకు అనాథలకు బి.ఎన్.ఆర్ యువసేన అధ్యక్షులు సమీవుల్లా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరోజనిమ్మ - వెంకటేశ్వర్లుకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బొంత సుధీర్, రాజులు, బొంత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్లు

నేత్రదానం

ప్రజాశక్తి-కావలి

కావలి కొట్టబజార్‌కు చెందిన వై.వి.సుబ్బా రావు (80) మంగళవారం తెల్లవారుజామున వారి స్వగృహంలో మరణించారు. ఆయన నేత్రాలను అభయం దంపతులు ఇ.వి.ఎస్. శ్రీవాణి, వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలతల సహకారంతో కుటుంబ సభ్యులు వై.వెంకటేశ్వర రావు అంగీకారంతో కుటుంబ సభ్యులు నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వై.వి.సుబ్బారావు నేత్రాలను దానం చేశారు. నేత్రాలను ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. తరువాత సర్టిఫికెట్‌ను కూడా అందజేశారు. మరణానంతరం నేత్రదానం చేయడానికి 9959589321, సునీల్.9494608060 శ్రీవాణి అభయం స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యురాలు ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

డిఎస్‌సి ప్రకటనపై హర్షం



ప్రజాశక్తి సీతారామపురం

ఏప్రిల్‌లోనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెం నిర్వహించిన ప్రజా వేదికలో వెల్లడించడంపై 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ మెంబర్, ఉదయగరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సిని నిర్వహించి చెప్పారని జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఎంపికైన వారు విధులలో చేరుతారన్నారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ప్రజలకు ప్రతి పథకాన్ని అందిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సర్‌ఛార్జీల పేరుతో బ్యాంకులు దోపిడీ

ప్రజాశక్తి-కావలి

జాతీయ బ్యాంక్‌లు సర్‌ఛార్జ్‌ల పేరిట చేసే దోపిడిని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు కావలి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఓ ఎం. సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి న్యాయం చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ ఇటీవల జాతీయ బ్యాంక్‌లు సర్‌ఛార్జ్‌ల పేరిట దళిత గిరిజన బడుగు వర్గాలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు జాతీయ బ్యాంక్‌లు పేదవారికి రుణాలు ఇచ్చి, ఇందిరాగాంధీ సాయంతో ఎంతోమంది బడుగు వర్గాలు అభివృద్ధికి చేయూత ఇచ్చాయని తెలిపారు. అలాంటి బ్యాంక్‌లు ఇప్పుడు దోపిడీ కేంద్రాలుగా మారాయని తెలిపారు. మూడుసార్లు గానీ ఎటిఎం ద్వారా డబ్బులు తీసుకొన్న తర్వాత ఆపైన అలాంటి లావాదేవీలకు రూ.50 కట్ చేస్తున్నారని తెలిపారు. సంవత్సరం నుండి ట్రాన్సాక్షన్ జరగడం లేదని, సంవత్సరానికి రూ.1000 లెక్కన కట్ చేస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీల డబ్బులు బ్యాంక్‌లో పడితే సగానికి సగం ఇస్తున్నారని తెలిపారు. అలాగే గ్యాస్ సబ్సిడీ డబ్బులు కూడా బ్యాంక్‌లు కట్ చేసుకుంటున్నాయని తెలిపారు. పేదవారు బతికే పరిస్థితి లేకుండా బ్యాంక్‌లు దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. ఈ సంవత్సరానికి 2024 - 25కు గాను రూ.96వేల కోట్లు సర్‌ఛార్జ్‌ల పేరిట వసూలు చేసి పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నారని తెలిపారు. వారు డబ్బులు ఎగొట్టి ఇతర దేశాలలో ఉంటు న్నారని తెలిపారు. పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలు కింగ్ విషర్, వీడియోకాన్ లాంటి సంస్థలకు ఇచ్చి ఇంగ్లాడ్, ఫిన్‌లాండ్, థాయిలాండ్‌లో వారు అమ్మాయిలతో జల్సాలుగా తిరుగుతున్నారని తెలిపారు. కాకులను కొట్టి గద్దలకు వేస్తున్నారని తెలిపారు. ఒకపక్క ప్రయివేటు బ్యాంక్‌లు, తండల్ వ్యాపారస్తులు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. సర్‌చార్జ్‌లను రద్దు చేయాలని దోపిడీలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మి నర్సు, జెడ్డా వాసు, ఆలూరి బ్రహ్మయ్య, ఇంకా అనేక మంది పాల్గొన్నారు.

ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నష్టపరిహారం పెంచి ఇవ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

భారత్ మాల 67వ జాతీయ రహదారికి భూములు కొల్పుతున్న రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని కోరుతూ అనంతసాగరం మండల రైతులు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం అనంతసాగరం మండల కమిటీల ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్‌డిఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ అనంతసాగరం మండలంలో ఉండే ఆమని చిరివెళ్ళ, ఇనగలూరు, బెడుసుపల్లి, పాత దేవరాయపల్లి రెవెన్యూ కింద రైతులు భూములు కోల్పోతు న్నారని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంకు రైతులు సుముఖంగా లేరని ప్రభుత్వం నష్టపరిహారం పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు గంట లక్ష్మీపతి, సిఐటియు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా, రైతుసంఘం మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్, రైతులు పుల్లారెడ్డి, ప్రసాద్ రెడ్డి, బొందల వెంకటేశ్వర్లు రెడ్డి, గండికోట పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

నిరసన ర్యాలీ చేపడుతున్న పాస్టరుల, తదితరులు

పాస్టర్ల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-బిట్రగుంట

భావ ప్రకటన స్వేచ్ఛ అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రస్తుతం ఆ హక్కుకు భంగం వాటిల్లుతుందని బోగోలు మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్సన్ బాబు పేర్కొన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి మద్దతుగా మంగళవారం బోగోలు మండలంలోని పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, సంఘ పెద్దలు, సంఘం కాపరులు, సంఘం సిస్టర్స్ యువతి, యువకులు సుమారు 500మందితో విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని పెట్రోల్ బంకు వద్ద నుండి బోగోలు అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో భారీర్యాలీ నిరసన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోగోలు మండల పాస్టర్స్ అధ్యక్షులు శ్యామ్సన్ బాబు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాలను ఉద్దేశ పూర్వకంగానే చంపారని, ఆయన మరణం యావత్ క్రిస్టియన్ సోదరుల మనసులను కలిసి వేసిందని, భారత రాజ్యాంగం భావ ప్రకటనను కల్పించిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక మతానికి మాత్రమే మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని అనుసరించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్.నాగరాజు, ట్రెజరీ రవికుమార్, పాస్టర్లు రెవరెండ్ డానియల్ బాబు, ఇమ్మానియేలు, ఎల్.సుధీర్ బాబు, రమేష్ బాబు, చంద్రహాస్, జీవన్ కుమార్, డేవిడ్ పాల్, పౌలయ్య, ఫిలిప్, సాల్మన్ రాజ్, జాన్సన్, జార్జ్, అనిల్, ఎస్ఐ బొజ్జ నాయక్, సిస్టర్స్, యువకులు, సంఘం కాపర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ బుచ్చి పట్టణంలోని క్రైస్తవ సంఘాలు మంగళవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇది హత్యానా లేక ప్రమాదమా అనే విషయాన్ని తేల్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్ నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి అనేక అనుమానాలకు తావిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కావలి పట్టణంలోని వివిధ క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు, మహిళలు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల తమ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తూ నిరసనకారులు నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం నిరసనకారులు కొవ్వొత్తులు వెలిగించి మోకాళ్ళ పై పాస్టర్ ప్రవీణ్‌కు శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బుచ్చి పట్టణంలోని పలు క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో దగాపడ్డ రైతులు..

- ఎపి రైతుసంఘం నాయకుల విమర్శలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గం రైతులు కొనుగోలు కేంద్రాలతో దగా పడ్డారని జిల్లా అధ్యక్షులు పులిగుండ్ల శ్రీరాములు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆత్మకూరు పట్టణం సిపిఎం కార్యాలయంలో ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక సంఘం నేతలతో పాటు జిల్లా అధ్యక్షులు పులిగుండ్ల శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని ధాన్యం కొనుగోలు కేంద్రాల పేరిట రైతులను మోసం చేస్తూ అధికారులే ధాన్యం కొనుగోలు చేసిన వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కృష్ణప్రసాద్, అనంతసాగరం రైతు సంఘం కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెట్టినట్లు చెబుతూ ఉన్న రైతులకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఆశించిన స్థాయిలో రైతులు ధాన్యం అమ్ముకోలేక పోయారన్నారు.

ప్రభుత్వం మాటలలో తప్ప చేతలలో ఆచరణ లేకపోవడం వల్ల ధాన్యపు పండించిన రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ధాన్యం బస్తాలు అందించలేక, తేమశాతం గుర్తింపులో తేడా కారణంగా, ధాన్యం తరలించేందుకు వాహనాలు అందించలేక పోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చే వసతి లేక తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. మొన్నటితో రబీ ధాన్యం కొనుగోలు పూర్తయిన మిగిలిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పడం సంతోషకర విషయమైనా తప్పనిసరిగా ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు పరిధిలో ధాన్యం కొనుగోలు విషయంలో భారీ కుంభకోణం చోటుచేసుకుని కోట్లాది రూపాయలు రైతులు నష్ట పోవాల్సి వచ్చిందని దానిపై సమగ్ర విచారణ చేయాలని వారు కోరారు.

పొలంలో రోడ్డు వేయొద్దు సారూ..

- జెసిబికి అడ్డుగా పడుకున్న రైతు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని వెన్నవాడ గ్రామంలో రోడ్డు పనులు చేపట్టే జెసిబికి అడ్డుగా రైతు పడుకుని తన పొలంలో రోడ్డు వేయొద్దంటూ వాపోయారు. రైతుల ఆందోళనతో రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి. మండలంలోని రామస్వామిపల్లి మండలం నల్లగొండ్ల వరకు రహదారి నిర్మాణం చేస్తున్నారు. ఈ పనులు చేపట్టేందుకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు వేసేందుకు జెండాలు పాతడంతో నాలుగు కుటుంబాల రైతులు ఆందోళనకు గురయ్యారు. వీరి పొలాలకు మధ్యలో రోడ్డు పోతుండటమే వీరి ఆందోళనకు కారణం. దాంతో మీరు మంగళవారం మధ్యాహ్నం ఆర్‌డిఒను కలిశారు. ఆర్‌డిఓ గ్రామ రైతులతో మాట్లాడుతూ అయినందున ప్రభుత్వం అవసరాలకు తీసుకువచ్చని అయితే బాధితులకు ఇక్కడ కోల్పోయే పొలం ఎంత ఉంటే అంత ప్రభుత్వ కేటాయిస్తామని ఆమె రైతులకు హామీనిచ్చారు. అప్పటికీ సమస్య సద్దుమణిగింది. అయితే గుత్తేదారు రోడ్డు నిర్మాణంకు జెసిపి తేవడంతో ఈ జెసిబికి అడ్డుగా పడుకొని ఆ పనులను ఆపేశారు. రైతుల తమ పొలం మధ్య కాకుండా ఒక అంచున రోడ్డు వేసుకోవాలని అంటున్నారు. అయితే రైతులు సూచించిన అంచున వాగు ఉందని అది రోడ్డు మనుగడను దెబ్బతీస్తుందనేది అధికారుల సంశయం. ఈ విషయం స్పష్టంగా తేల్చకుండా చేస్తున్నారు. తగిన చర్యలతో తమ పొలాలకు మధ్యలో కాకుండా ఒక పక్కనే వేయాలని వీరు కోరుతున్నారు.

జెసిబికి అడ్డుగా పడుకున్న రైతు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దుత్తలూరు

సురేష్ (ఫైల్)

విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ ఆలయం సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండల పరిధిలోని నర్రవాడకు చెందిన ఉదయగిరి సురేష్ (38) గత కొన్ని సంవత్సరాలుగా వెంగామాంబ దేవస్థానంలో విద్యుత్త పనులు చేసే ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గుడి దగ్గర ఏర్పాటు చేసి ఉన్న టెంకాయల దుకాణం వద్ద విద్యుత్తు మరమ్మతులు చేయడానికి వెళ్లాడు. విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. చుట్టుపక్కల దుకాణదారులు గమనించి అతనికి సపర్యలు చేశారు. మెలకువ వచ్చినట్లే వచ్చి తిరిగి స్పృహ కోల్పోవడంతో స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మీ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంగళవారం శవపంచనామా నిమిత్తం ఉదయగిరికి తరలించి మతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు సమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తగలబడుతున్న బ్యారెన్

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలో పొగాకు బ్యారెన్ అగ్నికి ఆహుతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మర్రిపాడు గ్రామానికి చెందిన గంగినేని విజయమ్మ, సుబ్బమ్మ బ్యారెన్‌ను ముప్పాళ్ళ వెంగయ్య లీజుకు తీసుకొని నడుపుతున్నారు. పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ఆకులు రాలి వేడి గొట్టాలపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయినా అప్పటికే పొగాకు కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షలు వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు రైతు వాపోయారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీకు 278మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 173మంది విద్యార్థులకు గానూ 171 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో105మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి -2 ధనలక్ష్మి తెలియజేశారు.

IN THE COURT OF HON'BLE SUBORDINATE JUDGE AT THIRUVOTTIYUR

MCOP: 2 of 2024

V.Balaji, S/o. Venkatesan,

... Petitioner

-Vs-

1. MBC Car Rental Pvt. Ltd., F1 F2, Guru Raghvendra Complex, NH.5, Tada, Nellure, Andhra Pradesh
2. Cholamandalam MS General Insurance

... Respondents

TO,

R1 MBC Car Rental Pvt. Ltd., F1 - F2, Guru Raghavendra Complex, NH.5, Tada, Nellore, Andra Pradesh, PIN - 524 121.

Please take notice that in the above case IN THE COURT OF HON'BLE SUBORDINATE JUDGE AT THIRUVOTTIYUR has ordered paper publication require your presence before the Hon'ble Court on 15.4.2025 at 10.30.a.m. failing which this matter will be decided in your absence.

R.RAMESH CHANDER,
Counsel for Complainant

ఉపాధి హామీ నిధులు గోల్‌మాల్..

ప్రజాశక్తి-కొడవలూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొడవలూరు మండలంలో 13 లక్షల 13 వేలు680 రూపాయలు నిధులు గల్లంతైనట్లు పీడీ గంగాభవాని తెలిపారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో మండలంలోని 24పంచాయతీలకు 2023 - 24 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ సంబంధించి జరిగిన అవినీతిపై కారకులైన వారిపై రికవరీకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రేగడిచిలక పంచాయతీకి సంబంధించి ఎనర్జీఎస్ నిధులలో రూ.11 లక్షలు గోల్‌మాల్ అయినట్లు గ్రామ స్థానికుడు భాస్కరరావు సమావేశంలో అధికారులకు తెలియజేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి రికవరీ చేయాలని కోరారు. దానిపై స్పందించిన పీడీ గంగాభవాని దుర్వినియోగం జరిగింది వాస్తవమే ఈ విషయం ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్బారావు, డివిఓ విజయలక్ష్మి, ఎనర్జీ ఎస్ఎ పీడీ ఎం మృధుల, సతీష్ బాబు, ఎస్ఆర్‌పి బి.కన్నారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ గంగా భవాని

డాక్టర్ శైలజను సన్మానిస్తున్న సిబ్బంది

శైలజకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజిలో సహాయ ఆచార్యులు డాక్టర్ వి.శైలజకు ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. ఈ పురస్కారం జీవన యోగశాల ఆరోగ్య సేవా ట్రస్టు నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగిన ఉగాది ప్రతిభా పురస్కారాలు కార్యక్రమంలో అందజేశారు. విద్య, కళలు, రచయితలు, క్లాసికల్ డాన్స్, వెస్టర్న్ డ్యాన్స్, కరాటే, తబల, హార్మోనియం, ఫిడేల్, గాయకులు మొదలైన వివిధ రంగాలలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన నెల్లూరు వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ శైలజకు ఈ అవార్డు రావడంతో ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి. జీవన యోగశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ చైర్మన్ ఎం.వి.ప్రసన్నకుమార్ అవార్డు గ్రహీతలుకు అభినందనలు తెలిపారు. రామాయణం మహేష్ స్వామి, లలితా భరద్వాజ దత్త పీఠాధిపతులు, కొత్తూరు, ఇందుకూరుపేట వారు అవార్డు గ్రహీతలను ఆశీర్వదించారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని కావలి ఎడవల్లి గ్రామ పంచాయతీలు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల అభివృద్ధి అధికారిని పి.ప్రసన్న కుమారి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో మంగళవారం రోజు ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బందికి, ఇతర అధికారులకు వారి కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి ఇచ్చా మన్నారు. స్థానిక నాయకులైన ఏలూరి మాల్యాద్రి నాయుడు, ఇతర టిడిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్, ఇంజ నీరింగ్ అసిస్టెంట్ టి.హరికుమార్ పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌లో పరిశీలన

ప్రజావక్తి-వింజమూరు

వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. 4వ తేదీ గానీ 5వ తేదీ గానీ డయాలసిస్ సెంటర్‌ను ఆరోగ్య శాఖ మంత్రి శ్రీసత్య కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. దానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించామన్నారు. నూతనంగా జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఓఓ డాక్టర్ కార్తీక్‌తో మాట్లాడుతూ మంత్రి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను చక్కగా చేయాలన్నారు. కొరతగా ఉన్న డాక్టర్లు సిబ్బందిని నియమించుకునేందుకు నివేదిక తయారు చేయాలన్నారు. అదేవిధంగా అవసరమైన సదుపాయాలను కూడా మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని తెలియజేశారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారితో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు స్థానిక నాయకులు సిబ్బంది తదితరులున్నారు.

డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ

క్షయ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : సమాజంలో ప్రతిఒక్కరూ క్షయ వ్యాధి నివారణపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా జీవించాలని సామాజికవేత్త మాలకొండా రెడ్డి తెలిపారు. పట్టణంలోని వెంగాయ్యగారిపాలెం అంగన్‌వాడీ కేంద్ర ఆవరణంలో మంగళవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచుగా దగ్గు జ్వరము వస్తున్నప్పుడు గళ్ళ పరీక్షలు ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రత పాటిం చాలని కోరారు. ముఖ్యంగా క్షయ వ్యాధి గాలి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మందులతో పూర్తి పూర్తిగా నయం చేయొచ్చు అని చెప్పారు. ప్రభు త్వం ఉచితంగా మందులు అంద జేస్తుందని, అలాగే పోషక ఆహార నిమిత్తం500 రూపాయలు నగదు కూడా ఇస్తారని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుకొని, సంపూర్ణ ఆరోగ్య వంతులుగా క్షయ వ్యాధి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎస్. పద్మ ఉపాధ్యాయులు రాజేశ్వరి, సురేష్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీకళ, మహిళలు పాల్గొన్నారు.